ఆలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

- గండాలయ స్వామి కొండపైకి రోప్ వే
- ఆర్టీసీ సర్వీసులు నడిపేందుకు కృషి
- ప్రతి ఒక్కరూ ట్రెక్కింగ్ మార్గంలో గండాలయస్వామిని దర్శించుకోవాలి
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు


గండాలయస్వామి కొండపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ గంజి


మొక్కలు నాటుతున్న భక్తులు, సందర్శకులు

మంగళగిరి: మంగళాద్రి లక్ష్మీ నృసింహస్వామి ఆలయంతోపాటు ఎగువ సన్నిధిలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయం, కొండపై వేంచేసియున్న గండాలయస్వామి ఆలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. ఆలయాల అభివృద్ధితోపాటు నగరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. సోమవారం నగరంలోని కొండపై వేంచేసియున్న గండాలయస్వామి ఆలయం ఆవరణలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి మొక్కలు నాటారు. భక్తులు, సందర్శకులతో మొక్కలు నాటించి గండాలయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నగర ప్రజలకు ఆక్సిజన్ అందించేందుకు మొక్కలు నాటడం జరిగిందన్నారు. నగరంలోని ఎయిమ్స్‌కు ఇరువైపులా ఉన్న కొండల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్న చెట్లు ఇప్పటికే పూర్తిస్థాయిలో పెరిగాయని, వాటితో పాటు మరిన్ని ఔషధ గుణాలు ఉన్న మొక్కలు నాటి నగర ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించడమేగాక పర్యావరణాన్ని రక్షించి భావితరాలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాస గృహాల ఆవరణల్లో, వీధుల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. కొండపై ఉన్న గండాలయస్వామి వారికి భక్తులు ఒక కమిటీగా ఏర్పడి సుమారు రూ.1.50 కోట్లతో శాశ్వత దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో ఇప్పటికే అన్నదాన సత్రం నిర్మించామని, కొండపై సుమారు మూడెకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటి భక్తులు కుటుంబ సభ్యులతో కలసి సేదతీరేందుకు వసతులు కల్పించడం జరిగిందన్నారు.

గండాలయస్వామి కొండపైకి రోప్‌వే....

గండాలయ స్వామి కొండపైకి భక్తులతోపాటు సందర్శకులు చేరుకునేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ట్రెక్కింగ్ మార్గం ఏర్పాటు చేశారని, మెట్ల మార్గం, ట్రెక్కింగ్ మార్గాల గుండా కొండ ఎక్కలేని వారి కోసం, పర్యాటకులను ఆకట్టుకునేందుకు దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద నుంచి రోప్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద నుంచి మంగళగిరి, పెదకాకాని, పొన్నూరు, అమరావతి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని, ఒకవేళ వీలుకాకుంటే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మినీ బస్సులు ఏర్పాటు చేయాలని ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి, జిల్లా కార్యదర్శి దాసరి వీరయ్య, శివాలయం ట్రస్టు బోర్డు సభ్యురాలు రేకా వకుళాదేవి, అన్నదాన సత్ర నిర్మాణ దాత దేవతి భగవన్నారాయణ, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, తోట శ్రీనివాసరావు, బేతపూడి నర్సయ్య, కుంచాల కృష్ణకిషోర్, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, దేవళ్ల సుబ్బారావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, అంజిబాబు, గుంటి విజయలక్ష్మి, రజక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహానాడులో సీసీ రోడ్డు నిర్మాణం

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మహానాడులో రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఏఈ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం మహానాడు 1, 1ఎ రోడ్లకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని, త్వరలోనే గతంలో నిర్మించని రోడ్లలో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక ఎస్టీ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు సోమవారం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. పెనుమాక ఎస్టీ శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ కావాలని ఎమ్మెల్యే ఆర్కేను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి మొదట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి అనంతరం సర్వే నిర్వహించి, ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ కృష్ణారెడ్డికి సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు డీఈ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం



మంగళగిరి: నగరంలోని కోర్టు ఆవరణలో సోమవారం అంతర్జాతీయ న్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నాదుల లెనిన్‌బాబు, జాయింట్ సెక్రటరీ రెంటపల్లి రాజేష్, మహిళా కార్యదర్శి కె స్వరూపరాణి, న్యాయవాదులు కె అంబేడ్కర్, లంకపల్లి పెద బుజ్జాయి, నెమలికంటి రజని, కట్టిపోగు కోటయ్య, తాడిశెట్టి మురళి, నూతక్కి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



మంగళగిరి: నగరంలోని పార్కు రోడ్డులో జరిగిన కుక్కల దాడి ఘటనలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. పార్కు రోడ్డు ఐదో లైనుకు చెందిన జెడ్డా వందనం, కృష్ణవేణి దంపతుల కుమార్తె తొమ్మిదేళ్ల మధు ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతుంది. సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా కుక్కలు వెంబడించి దాడి చేసి గాయపర్చాయి. చిన్నారి భయపడి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని కుక్కలను తరిమికొట్టారు. గాయపడిన చిన్నారి మధును కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. నగరంలో కుక్కలు, పందులు, ఆవుల సంచారాన్ని అరికట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం గ్రామానికి చెందిన సువార్తమ్మ, బురదగుంట మనిరాజు, షేక్ మొహమ్మద్‌లు అనారోగ్యానికి గురై బాధపడుతుండగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకులు కత్తిక రాఘవరావు, మల్లికార్జునరావుల ద్వారా సోమవారం సువార్తమ్మ, మనిరాజులకు రూ.20 వేలు చొప్పున, మొహమ్మద్‌కు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు, కన్వీనర్ షేక్ మీరాసా, వడ్డేశ్వరం లక్ష్మణ్, షేక్ బాజీ, గుడిసె రాజు, వడ్డేశ్వరం రవి, చంద్రశేఖరరావు, వడ్డేశ్వరం పాల్ రాజు, బిరుదుగడ్డ ఇశ్రాయేలు, చిలువూరి కరుణాకర్, వడ్డేశ్వరం కృపాకర్ రావు, చిలువూరి ఏసుబాబు, గుడిసె జిన్నా తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామానికి చెందిన రెడ్డి భూలక్ష్మి, యార్లగడ్డ పద్మావతి, రావూరి కోటమ్మలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) టిఫిన్, తోపుడు బండ్లను అందజేశారు. వాటిని సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంభంపాటి క్రాంతికుమార్, దాసరి వీరయ్య, రఘునాథ్ యాదవ్, బానావత్ వెంకటేశ్వర నాయక్, పిల్లి ధర్మరత్నం, ఆత్మకూరి నాగేశ్వరరావు, నూతక్కి కోటేశ్వరరావు, తుమ్మపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంది సాగుతో మేలైన దిగుబడులు

ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె రాజకుమారి


పత్తిలో అంతర పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె రాజకుమారి

లాం(తాడికొండ): పత్తిలో అంతర పంటగా కంది సాగుతో మేలైన ఫలితాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె రాజకుమారి అన్నారు. సోమవారం తాడికొండ మండలం లాం గ్రామంలోని పత్తిలో అంతర పంటలు వేసిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఆరు వరుసల పత్తికి ఒక వరుస కంది పెట్టుకోవడం, సరిహద్దు పంటలుగా గల్ల వెంబడి నాలుగు వరుసలు సజ్జ, జొన్న విత్తుకోవాలని అందులో ఆకర్షక పంటలుగా బంతి, ఆముదం నాటుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ ఏడాది వాతావరణంలో ఏర్పడిన అసమతుల్యతను తట్టుకునే విధంగా ప్రధాన పంటతోపాటు పలు అంతర పంటలు విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్‌తో కేఎల్‌యూ ఎంఓయూ


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కేఎల్‌యూ, ఐసీఎస్ఐ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ (ఐసీఎస్ఐ) అమరావతి చాప్టర్‌తో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అవగాహన కుదుర్చుకున్నట్లు యూనివర్సిటీ అడిషనల్ డీన్ హరికిరణ్ వేగే తెలిపారు. యూనివర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐసీఎస్ఐ చైర్మన్ సోను శివరామకృష్ణ తమ విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థులకు కంపెనీ సెక్రటరీ ఉద్యోగాల గురించి అవగాహన కల్పించారని అన్నారు. ఇండస్ట్రియల్ పైన ఆసక్తి గల వారు న్యాయ విద్యతోపాటు కంపెనీ సెక్రటరి (సిఎస్) కోర్స్ కూడా చేసుకోవచ్చని విద్యార్థులకు వివరించామని అన్నారు. రానున్న కాలంలో న్యాయశాస్త్ర విభాగంతో పాటు కంపెనీ సెక్రటరి (సిఎస్) కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీఎస్ఐ చైర్మన్ సోను శివరామకృష్ణ మాట్లాడుతూ 2013 కంపెనీ యాక్ట్ ప్రకారం ప్రతి కంపెనీలో కీలకమైన కీ మేనేజర్‌లలో కంపెనీ సెక్రటరీలు కూడా చాలా కీలకమన్నారు. న్యాయశాస్త్ర విద్యనభ్యసించిన వారికి సుమారు 12 పాఠ్యాంశాలను చదవకుండానే మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ, అధ్యాపకురాలు డాక్టర్ శైలజ, డాక్టర్ కామసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న కేఎల్‌యూ అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని కేఎల్‌యూ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్, ఉమెన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విద్యార్థి విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు, మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నుంచి రక్షణ పొందడానికి సెల్ఫ్ టెక్నిక్స్ ఉపయోగపడతాయని వివరించారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ఉమెన్ ఫోరమ్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహనతోపాటు సమస్యల నుంచి బయట పడే విధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమానికి ఉమెన్ ఫోరమ్ కో కన్వీనర్ డాక్టర్ సోనీ, డాక్టర్ గోపీకృష్ణ, సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. నిర్వాహకులను వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ. వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు అభినందించారు.

పట్టణ ప్రణాళిక విభాగంలో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీబీఓ, టీపీఎస్‌లు, టీపీఓలకు అంతర్గత బదిలీలు చేస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీపీబీఓ రసూల్‌కు(1 నుంచి 7 వార్డులు, 52 వార్డు), టీపీఎస్ బాబు సువర్ణకుమార్(16 నుంచి 22, 25), టీపీఎస్ ఎ.లక్ష్మణస్వామి(24,26 నుంచి31), టీపీఎస్ బి.హృదయరాజు(39 నుంచి 48), టీపీఎస్ షేక్ రిజ్వాన(22, 32 నుంచి 38), టీపీఎస్ జె. గోవర్ధన్(8 నుంచి 15), టీపీఓ బి.నాగవల్లి (49,50,51,53 నుంచి 57 వరకు), డీసీపీ- 1 ప్రదీప్ కుమార్‌కు(18 నుంచి 25, 28 నుంచి 47,49,52), డీసీపీ- 2 కోటయ్యకు(1 నుంచి 17, 26, 27,48,50, 51,53 నుంచి 57 వరకు) వార్డులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయన్నారు.

'చే'నేత'ను బలోపేతం చేయడమే లక్ష్యం

- లాటరీ విధానంలో మగ్గం షెడ్ల కేటాయింపు
- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు


లాటరీ తీస్తున్న చేనేత కార్మికురాలు, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి కృషి చేయగా నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరింత అభివృద్ధి పరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో రూ.3.50 కోట్లతో నిర్మించిన మగ్గం షెడ్లను సోమవారం లాటరీ విధానంలో నేతన్నలకు కేటాయించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో మగ్గం షెడ్ల నిర్మాణం వైఎస్సార్ కాలంలో జరగాల్సి ఉండగా ఆయన అకాల మరణంతో వీలుపడ లేదన్నారు. నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చి నేతన్నకు అండగా నిలబడటం అభినందనీయమన్నారు. మగ్గం షెడ్లలో 146 మంది నేతన్నలకు నేతన్న నేస్తం తప్పకుండా అందజేస్తామన్నారు. మగ్గం షెడ్లు పొందిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే నేత నేయాలని, విక్రయించడం గానీ, అద్దెలకు ఇవ్వడం గానీ జరిగితే షెడ్డు రద్దు చేయడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో నిర్మించాల్సిన మగ్గం షెడ్లు అనివార్య కారణాల వల్ల ఆగిపోయినా నేడు ఎమ్మెల్యే ఆర్కే చొరవ తీసుకుని మగ్గం షెడ్లు నిర్మించి కార్మికులకు అందజేయడం చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చాటిందన్నారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నేతన్నల అభివృద్ధి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. రాష్ట్ర చరిత్రలో మగ్గం షెడ్లు నిర్మించి సొంత మగ్గం లేని కార్మికులకు ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీఏ వనజ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

కాలువ లాకులకు మరమ్మతులు పూర్తి

- సొంత నిధులతో మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


మరమ్మతుల అనంతరం పెరికలపూడి కెనాల్ లాకులు

తాడేపల్లిరూరల్: మోరంపూడి(ఎడమ కట్ట), పెరికలపూడి ప్రాంతాలకు సాగునీరు అందించే లాకుల మరమ్మతు పనులు సోమవారం పూర్తయ్యాయి. బకింగ్‌హామ్ కెనాల్‌కు అనుసంధానమైన మోరంపూడి (ఎడమ కట్ట), పెరికలపూడి ప్రాంతాలకు సాగునీరు అందించే లాకులు పూర్తిగా పాడైపోయాయి. అవసరమైనపుడు సాగునీరు అందక, అవసరం లేనపుడు సాగునీరు అధికంగా రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమస్యను వివరించారు. ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులు రెండు లాకుల కాంక్రీట్, షట్టర్లు బిగించేందుకు టెండర్లు పిలిచామని, మరో నెల రోజుల వ్యవధి పడుతుందని చెప్పారు. మరో 20 రోజుల్లో వరినాట్లు ప్రారంభించేందుకు రైతులు తమ పొలాలను చదును చేసుకుంటున్నారని, బకింగ్‌హామ్ కెనాల్ హెడ్ స్లూయిస్‌కు సాగునీరు విడుదల చేస్తారని, ఆ సమయంలో మరమ్మతులు చేయడం కష్టతరంగా మారుతుందని, ముందుగా చేయాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వారి వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో, సొంత నిధులతో మరమ్మత్తులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ మరుసటి రోజే మరమ్మతులు ప్రారంభించారు. సోమవారం నాటికి మరమ్మతులు పూర్తి చేశారు. ఆ మరమ్మతులు పూర్తిచేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



ఏదైనా సమస్యను నాయకుల దృష్టికి తీసుకు వెళితే చూద్దాం, చేద్దాం అంటూ కాలం వెళ్లబుచ్చుతూ ఉంటారు. ఎమ్మెల్యే ఆర్కే మాత్రం రైతులు తమ సమస్యను చెప్పిన వెంటనే వచ్చి పరిశీలించి పూర్తిగా పాడైపోయిన లాకులకు మరమ్మతులు చేశారు. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కానసాని లక్ష్మీనారాయణ, పెరికలపూడి

సొంత డబ్బులతో చేయించారు..



కాలువ లాకులు పాడైపోవడం వల్ల వరి పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్వయంగా పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తన సొంత డబ్బులతో మరమ్మతులు చేయించారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉన్నంతకాలం రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– గోళ్ల అశోక్, చినపాలెం

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

తాడికొండ: పని నిమిత్తం వెళుతూ ఆటో దిగి నిలబడగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తికి కాలు విరిగి గాయాలపాలైన ఘటన తాడికొండ అడ్డరోడ్డు సమీపంలోని రవిచంద్ర స్పిన్నింగ్ మిల్స్ సమీపంలో జరిగింది. వివరాల ప్రకారం లేమల్లె గ్రామానికి చెందిన బూరుగుమళ్ల శ్రీనివాసరావు అడ్డరోడ్డు రవిచంద్ర స్పిన్నింగ్ మిల్లులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆటోలో వచ్చి దిగి డబ్బులు ఇస్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావుకు గాయాలు కావడంతోపాటు కుడికాలు విరగడంతో ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి (కొత్తపాలెం)లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైన్ల పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని, కావున వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

తాడేపల్లి బూత్ కమిటీ సభ్యులతో సమావేశం

మంగళగిరి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ విజయానికి ఇప్పటి నుంచే బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోరారు. నగరంలోని ఆటోనగర్‌లో గల ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి సోమవారం తాడేపల్లి బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పేదవాడు గొప్పవాడు కావాలనే ఆశయంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నారన్నారు. గత 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తాడేపల్లి ప్రాంతం ఎంతో అండగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ 2014, 2019 మాదిరి కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఓటర్ల జాబితా సవరణ నేపథ్యంలో దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలు తొలగింపుతోపాటు కొత్త ఓట్లను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు (పండు), మహిళా విభాగం అధ్యక్షురాలు సంపూర్ణ పార్వతి, ఎస్సీసెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విపత్తుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌కు డాక్టరేట్



తాడేపల్లిరూరల్: ఏపీ విపత్తుల సంస్థలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న బాలిబోయిన ప్రసాద్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తమ సంస్థలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ ఉపయోగించి కృష్ణా, గుంటూరు జిల్లాల భౌతిక, సామాజిక దుర్బలత్వం, వరద విపత్తుల అంచనా అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మార్గదర్శకత్వంలో రీసెర్చ్ చేశారని అన్నారు. విపత్తుల సంస్థలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాలపై పరిశోధన చేసిన అధికారుల సంఖ్య ఐదుకు చేరిందన్నారు. ప్రసాద్‌ను విపత్తుల సంస్థ ఈడీ సి.నాగరాజు, డాక్టర్ ఎం.ఎం.ఆలీ, డాక్టర్ పూర్ణచంద్, డాక్టర్ బాలకృష్ణ, శాంతిస్వరూప్ ఇతర సిబ్బంది అభినందించారు.





కృష్ణాయపాలెంలో ఈనెల 24న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. - మంగళగిరి